క్లుప్తంగా

వాటర్ ఫిల్టర్ అందజేత



ఫిల్టర్ వద్ద నిర్వాహకులు, విద్యార్థులు

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని జుమ్మెరత్పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు శనివారం యూనిమోని కంపెనీ వారు రూ.30వేల విలువైన వాటర్ ఫిల్టర్(శుద్ధజల కేంద్రం) అందజేశారు. వేసవిలో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడకుండా ఫిల్టర్‌ను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో కంపెనీ నిర్మల్ బ్రాంచి మేనేజర్ రవికుమార్, అఖిలేశ్, ఉపాధ్యాయులు రమణ, పోలీస్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా'

భైంసాటౌన్: ప్రభుత్వ ధాన్యం అక్రమంగా పక్కదారి పట్టించిన రైస్‌మిల్లర్లకు ఎవరైనా సహకరిస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ అన్నారు. ఈమేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో పలువురు రైస్‌మిల్లర్లు రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడ్డారని.. ఈ విషయం ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో స్పందించిన ప్రభుత్వం జిల్లాలో వరుస కేసులు నమోదు చేస్తోందన్నారు.

తైబజార్ వేలం వాయిదా

ఖానాపూర్: పట్టణ పరిధిలో నిర్వహించే వారసంత తైబజార్ వేలంను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ జాదవ్‌కృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. తిరిగి వేలం నిర్వహించే తేదీని ఉన్నతాధికారుల సూచనతో త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

2న 'సర్వాయి' వర్ధంతి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు, అధికారులు రావాలని కోరారు.

3న దొడ్డి కొమురయ్య జయంతి

బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3న దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహిస్తామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఎస్సైగా సాయికుమార్

దస్తురాబాద్: దస్తురాబాద్ ఎస్సైగా సాయికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. 15 రోజుల కిందట ఎస్సైగా చేరిన సి.అశోక్ కుంటాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నిర్మల్‌టౌన్‌లో ఎస్సైగా పని చేసే సాయికుమార్ బదిలీపై దస్తురాబాద్ వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఖానాపూర్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 1న ఖానాపూర్ పట్టణంలో నిర్వహించే వీర హనుమాన్ విజయయాత్రకు రావాలని శనివారం ఉట్నూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును నాయకులు కలిసి ఆహ్వానించారు. కాసవేణి ప్రణయ్, కిషన్‌రెడ్డి, ప్రభాకర్, రాజేశ్వర్, రాజశేఖర్, లోకేశ్, సాయి, ప్రణీత్, ప్రతాప్ ఉన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

సోన్: పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని లెఫ్ట్‌పోచంపాడ్ గురుకులం, సోన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు తెలుసుకున్నారు. అనంతరం సీఎస్, డీఓలకు పలు సూచనలు చేశారు.

పరీక్ష కేంద్రం తనిఖీ చేసిన ఏఎస్పీ

ముధోల్: మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల(బాలురు)లో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని శనివారం ఏఎస్పీ అవినాష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోకి వెళ్లి పరీక్ష తీరును పరిశీలించారు. పలువురు సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తానూరు: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-5ను శనివారం ఎంపీడీవో నసీరొద్దీన్ తనిఖీ చేశారు. కేంద్రం పరిధిలోని లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. చిన్నారులకు ఆటపాటలతో పూర్వప్రాథమిక విద్య బోధిస్తూ మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి జలంసింగ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నిలువ నీడ కరువు..

- బాసరలో బస్‌షెల్టర్లు లేక పాట్లు
- గోస పడుతున్న ఆర్జీయూకేటీ విద్యార్థులు
- రోడ్డుపైనే ప్రయాణికుల ఎదురుచూపు

బాసర: చదువులమ్మ కొలువుదీరిన బాసరలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. రైల్వేస్టేషన్, ఆర్జీయూకేటీ కళాశాల ముందు, సరస్వతీ ఆలయం వద్ద నిల్చొనేందుకు నీడ లేక రోడ్డుపైనే పడిగాపులు కాస్తున్నారు. నిత్యం బాసరకు అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది వస్తుంటారు. ఇక్కడి వర్సిటీలో చదివే విద్యార్థులు ఇళ్లకు వెళ్లాలన్నా ఇబ్బందే. ఎండకు ఎండుతూ వానలకు తడుస్తున్నారు. ఒంటికి, రెంటికి వస్తే వారి కష్టాలు వర్ణనాతీతం. ప్రధాన కూడళ్ల వద్ద బస్‌షెల్టర్లతోపాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు, పాలకులు పట్టించుకోవాలి..

హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వేస్టేషన్ మలుపు వద్ద.. కళాశాల ఎదుట ప్రధాన రోడ్డుపై గంటల తరబడి ఎండలో నిల్చుంటున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్ల వద్ద బస్సుషెల్టర్లు ఏర్పాటు చేయడం లేదు. అధికారులు, పాలకులు స్పందించి బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.



యూనివర్సిటీ వద్ద ఎండలో నిల్చున్న విద్యార్థులు



బస్సు ఎక్కుతున్న విద్యార్థులు



బస్సుషెల్టర్ లేక రోడ్డుపై ఎదురుచూస్తున్న విద్యార్థులు



రైల్వేస్టేషన్ వద్ద బస్సు కోసం ఎండలో వేచి చూస్తున్న ప్రయాణికులు

ఉపాధి పనులకు వచ్చేలా చూడాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాధ

లక్ష్మణచాంద: కూలీలు ఉపాధి పనులకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రాధ.. సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని వడ్యాల్ గ్రామంలో ఉపాధి పనుల జరుగుతున్న ప్రదేశం వద్దకు వెళ్లి కూలీల వివరాలు తెలుసుకున్నారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం మునిపల్లికి వెళ్లి పంచాయతీ రికార్డులు పరిశీలించారు. నర్సరీని సందర్శించి మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఆదేశించారు. కార్యదర్శులు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

నేడు కుస్తీ పోటీలు

కుభీర్: ఉగాది పండుగ పురస్కరించుకొని కుభీర్ విఠలేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంటాజీ, ఉపాధ్యక్షుడు సూది రాజన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మందిరంలో పంచాంగ శ్రవణం, ఆ తర్వాత వివేకానంద చౌరస్తా పక్కన పోటీలు నిర్వహిస్తామని మల్లయోధులు పాల్గొనాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

భైంసాటౌన్: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ అన్నారు. పట్టణంలోని కుంట ప్రాంతంలో శనివారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 52 బైక్‌లు, 2 ఆటోలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పలువురికి జరిమానా విధించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడారు. అపరిచితులు, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అవగాహన పెంచుకోవాలని.. అసాంఘిక కార్యకలాపాలను సహించేది లేదని పేర్కొన్నారు. సీఐ గోపినాథ్, ఎస్సైలు శ్రీనివాస్, అజయ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి

- డీఈవో రామారావు

నిర్మల్‌రూరల్: సమాజంలో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని డీఈవో రామారావు అన్నారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందే విద్యాధర్(జెడ్పీఎస్ఎస్ జీహెచ్‌ఎం, మిర్జాపూర్, భైంసా మండలం), వకుల కుమారి(స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ కొండాపూర్, నిర్మల్‌రూరల్ మండలం), సాగర్‌రెడ్డి(స్కూల్ అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ జామ్, సారంగపూర్ మండలం), శాంత్‌కుమార్(హెచ్‌ఎం, ఎంపీపీఎస్ సోన్), రాజారెడ్డి(పీఎస్ హెచ్‌ఎం, చింతకుంట, ముధోల్ మండలం), గోదావరి(పీఎస్ హెచ్‌ఎం, పీచర, లక్ష్మణచాంద మండలం), విద్యారాణి (పీఎస్ హెచ్‌ఎం, గుండంపల్లి, దిలావర్‌పూర్ మండలం)లకు శనివారం డీఈవో కార్యాలయంలో సన్మానం ఏర్పాటు చేశారు. తొలిసారి విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులను సన్మానించారు. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ ఫైనాన్స్, అకౌంట్స్ అధికారి రమణారెడ్డి, పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఎస్‌ఓలు రాజేశ్వర్, నరసయ్య, సలోమి కరుణ, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, డీసీఈబీ సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో డీఈఓ, వివిధ సంఘాల నాయకులు

శనీశ్వరుడి ఆలయంలో పూజలు

భైంసాటౌన్: పట్టణంలోని శనీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. శనివారం అమావాస్య సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకం, నవధాన్యాలతో పూజలు చేశారు. ఆలయం వద్ద వివేకానంద ఆవాసం ఆధ్వర్యంలో తాగునీరు, ప్రసాదం అందించారు.

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామ శివారు శనీశ్వర ఆలయంలో శనివారం భక్తులు పూజలు నిర్వహించారు. కొబ్బరికాయలు, నూనె, నవధాన్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భైంసారూరల్: మండలంలోని దేగాం, వానల్‌పాడ్, ఖత్‌గాం, సిరాల గ్రామాల్లో నవగ్రహాల ప్రతిమలకు భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. శనీశ్వరుడికి 9, 18 రకాల ధాన్యాలు తీసుకెళ్లి ఆలయంపై చల్లుకుంటూ ప్రదక్షిణలు చేశారు.



భైంసాలో పూజలు చేస్తున్న భక్తులు

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: ఈనెల 31తో ఎల్ఆర్ఎస్‌పై 25శాతం, మున్సిపల్ పన్నుల బకాయిలపై వడ్డీ 90శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఖానాపూర్ పట్టణ పరిధిలో రూ.కోటి 93లక్షల47వేలు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.కోటి 42వేలు(52శాతం) వసూలైనట్లు తెలిపారు. మరో రూ.93లక్షల 5వేలు రావాల్సి ఉందని పేర్కొన్నారు. రాయితీని సద్వినియోగం చేసుకునేవారు స్థానిక మున్సిపల్ సిబ్బందిని సంప్రదించాలని కోరారు. ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల క్రమబద్ధీకరణకు 25శాతం రాయితీ అవకాశాన్ని ఇప్పటివరకు 66 మంది సద్వినియోగం చేసుకున్నారని పేర్కొన్నారు. మొత్తం 978 మంది నుంచి రూ.50 లక్షలు వసూలు కావాల్సి ఉండగా 66 మంది నుంచి రూ.15లక్షలు వసూలైనట్లు తెలిపారు.

వసూలు వేగవంతం చేయాలి

భైంసాటౌన్: పట్టణంలో ఆస్తి, ఇతర పన్నుల వసూలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో బిల్ కలెక్టర్లు, రెవెన్యూ సిబ్బందితో పన్నుల వసూలుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 31తో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున వసూలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ అవకాశం కల్పించిందని.. ఈ విషయంపై బకాయిదారులకు వివరించాలన్నారు. ఇప్పటివరకు 43శాతం వసూలు పూర్తయిందని.. లక్ష్యం చేరుకునేలా కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

కళాకారులకు ఉద్యోగాలివ్వాలి

నిర్మల్‌టౌన్: ఉద్యమ నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతికశాఖ సారథిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సంఘం జిల్లా ఇన్‌చార్జి కోల వెంకటేశ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. గత ప్రభుత్వం కళాకారులతో 550 ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి ఉద్యోగాలు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నప్పటికీ భర్తీ చేయడం లేదని మండిపడ్డారు. కళాకారుల కష్టాలను అసెంబ్లీలో వివరించిన కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు సాయిరాజ్, అధ్యక్షుడు కోరుట్ల రాజేశ్వర్, మహిళా విభాగం అధ్యక్షురాలు మొగిలి మమత, బిర్కుల సురేశ్, టేకులపల్లి భోజన్న, సభ్యులు ఉన్నారు.

కరువుభత్యం అమలు చేయాలి

లక్ష్మణచాంద: రాష్ట్రంలోని ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న.. బీడీ పరిశ్రమల యాజమాన్యాలను డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని చామన్‌పెల్లిలో ఆయన మాట్లాడారు. (వీడీఏ)కరువు భత్యం 104 పాయింట్లు పెరిగిందని.. పాయింట్‌కు పది పైసల చొప్పున రూ.10.40 కాగా దీని ప్రకారం వెయ్యి బీడీలకు కూలీ రేటు రూ.261.97 అవుతుందన్నారు. నెలసరి ఉద్యోగులకు, చాటల్ వారికి, బట్టీ వాళ్లకు, నెలకు రూ.312, బీడీ ప్యాకర్లకు రోజుకు రూ10.40 చొప్పున పెరిగిందన్నారు. అంతకుముందు కరువుభత్యం అమలు చేయాలనే డిమాండ్‌తో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ముత్తవ్వ, భోజవ్వ, లక్ష్మి, గుండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు



భైంసాలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



కుంటాల ఆదర్శ పాఠశాలలో..



భైంసారూరల్: పచ్చడి పంపిణీ చేస్తున్న విద్యార్థులు



ముధోల్‌లో..

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. పండుగ విశిష్టత వివరించారు. పచ్చడి తయారు చేసి పంచిపెట్టారు. ప్రధానాచార్యులు గంగాధర్, ఆచార్యులు ఉన్నారు.

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, సృజన విద్యానిలయం పాఠశాలల్లో ముందస్తు ఉగాది నిర్వహించారు. సంప్రదాయ నృత్యాలతో విద్యార్థులు సందడి చేయగా.. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ప్రిన్సిపాళ్లు నవీన్‌కుమార్, గంగన్న, మహిళా కానిస్టేబుళ్లు సవిత, అశ్విని పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో ఉగాది సంబరాలు నిర్వహించారు. తపస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్ పండరి, యోగిత, భోజరాం పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో వేడుకలు నిర్వహించారు. ప్రధానాచార్యులు సారథిరాజు, దేవేందర్‌చారి, ఆచార్యులు ఉన్నారు.

నూతన కోర్సు ప్రవేశపెట్టాలి

నిర్మల్‌రూరల్: ఇంటర్‌లో హెచ్‌సీఈసీ కోర్సు ప్రవేశపెట్టాలని జిల్లాలోని హిస్టరీ అధ్యాపకులు డీఐఈవో పరశురాంకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అవసరాలకు అనుగుణంగా ఇంటర్ కోర్సుల్లో మార్పులు చేయకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో హెచ్‌ఈసీ గ్రూపులో అడ్మిషన్లు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎంబైపీసీ గ్రూప్ ప్రవేశపెట్టాలనే ఆలోచన చేయడం శుభ పరిణామమని పేర్కొన్నారు. ఆర్ట్స్‌లోనూ హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపులను కలిపి హెచ్‌సీఈసీ కోర్సును ప్రవేశ పెట్టాలని కోరారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసాద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సిరిగా రవీందర్, అధ్యాపకులు నరహరి పాల్గొన్నారు.

ఒకే వేదికపై మాజీ ఎమ్మెల్యేలు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో కల్యాణ మండపంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌రావు పటేల్, విఠల్‌రెడ్డి హాజరై ఒకే వేదికపై కూర్చొన్నారు. వీరు గతంలో ప్రత్యర్థులుగా తలపడి ప్రస్తుతం కాంగ్రెస్‌లో కొనసాగుతున్నా.. ప్రత్యేక క్యాడర్ కల్గి ఉన్నారు. వీరు వేదికపై మాట్లాడుకోవడంతో కార్యకర్తలు ఆశ్చర్యపోయారు. గతంలో ముధోల్ ఎమ్మెల్యేగా 1994లో నారాయణ్‌రావు పటేల్ టీడీపీ నుంచి పోటీ చేసి విఠల్‌రెడ్డి తండ్రి గడ్డిగారి గడ్డెన్న(కాంగ్రెస్)పై విజయం సాధించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌సీపీ నుంచి నారాయణ్‌రావు పటేల్, బీఆర్ఎస్ నుంచి విఠల్‌రెడ్డి పోటీ చేయగా విఠల్‌రెడ్డి విజయం సాధించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నారాయణ్‌రావు పటేల్.. బీఆర్ఎస్ నుంచి విఠల్‌రెడ్డి ప్రత్యర్థులుగా తలపడగా ఇద్దరూ ఓడిపోయారు. అనంతరం విఠల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా వీరు దూరం ఉంటున్నారు. తాజాగా వీరు ఒకే వేదికపై పక్కపక్కనే కూర్చొని గుసగుసలు మాట్లాడుకోవడంతో కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మాట్లాడుకుంటున్న మాజీ ఎమ్మెల్యేలు

సన్మానం

సారంగపూర్: నిర్మల్ బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది అల్లూరి మల్లారెడ్డి, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ వంశీకృష్ణను శనివారం మండలంలోని కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో వంగ భూమారెడ్డి, సత్యం, వెంకటరమణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్లు

సారంగపూర్: రంజాన్ పర్వదినం సందర్భంగా మండల కేంద్రంలోని ఈద్గా వద్ద ఎంపీఓ అజీజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఏర్పాట్లు చేయించారు. పిచ్చిమొక్కలు తొలగించి ట్రాక్టర్‌తో చదును చేయించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు ఫహీమ్, నయీముద్దీన్ తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలకేంద్రంలోని ఈద్గా వద్ద పరిసరాలను శనివారం పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. రంజాన్ పండుగ నేపథ్యంలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేలా ఏర్పాట్లు చేయించినట్లు ఈవో అన్వర్ అలీ పేర్కొన్నారు.

ప్రజలను చైతన్యవంతం చేయాలి

లోకేశ్వరం: రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాంభూపాల్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మన్మద్ గ్రామంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యేలు నారాయణ్‌రావు పటేల్, విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గడ్డం సుదర్శన్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి రమేశ్వర్‌రెడ్డి, భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, రాంచందర్‌రెడ్డి, షఫీ, రత్నాకర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం

కుంటాల: ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని కుంటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు లింగం, సురేశ్ అన్నారు. శనివారం కుంటాల ఆదర్శ పాఠశాలలో పదోతరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులను కోరారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తామని మున్సిపల్ మాజీ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. శనివారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీని సందర్శించి కాలనీ వాసులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సమస్య తెలుసుకునేందుకు వచ్చానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సైబర్ నేరాలపై అవగాహన

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం మహిళా కానిస్టేబుళ్లు సవిత, అశ్విని సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

విందును బహిష్కరిస్తున్నాం

ఖానాపూర్: పట్టణంలోని జామా మసీదు ఎదుట ప్రభుత్వం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందును తాము బహిష్కరిస్తూ నిరసన తెలుపుతున్నామని బీఆర్ఎస్ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షోయబ్ హుస్సేన్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల వేళ ముస్లింలకు ఇచ్చిన హామీలను మరిచిపోయి బడ్జెట్‌లో అన్యాయం చేశారని పేర్కొన్నారు.

యువకుడికి గాయాలు

ముధోల్: మండలకేంద్రానికి చెందిన ఊరేకర్ పోతన్న అనే యువకుడు.. ముధోల్‌లోని నాందెడ్ గల్లీ రోడ్డుపై ఓ విద్యుత్ స్తంభాన్ని బైక్‌తో ఢీకొట్టి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారంతో బ్లూ కోర్ట్ విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ రాజమణి, ఎస్సై సంజీవ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. అంబులెన్సుకు సమాచారం అందించి భైంసా ఏరియాసుపత్రికి తరలించగా యువకుడు చికిత్స పొందుతున్నాడు.

వాహనాలు తనిఖీ

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ ప్రధాన రహదారిపై శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లు బ్లూకోల్ట్ పోలీసులుగా విధులు నిర్వర్తించారు. పలువురికి జరిమానా విధించారు. సిబ్బంది మల్లీశ్వరి, శ్రావణి ఉన్నారు.

ముధోల్: మండలకేంద్రంలో ఎస్సై సంజీవ్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల ధ్రువపత్రాలు పరిశీలించి పలువురికి జరిమానాలు విధించారు. పెట్రోకార్, బ్లూకోల్ట్ సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో చేపట్టాలి

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని భాగాపూర్‌లో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ సోలమాన్‌రాజ్, కార్యదర్శి ఉన్నారు.

శిశుమందిరాలు సంస్కృతికి నిలయాలు

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీ సరస్వతి శిశు మందిరాలు సంస్కృతికి నిలయాలని నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి శ్రీ సరస్వతి శిశు మందిర్, బుధవార్‌పేట్ పాఠశాలల వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధ్యక్షుడు పూనా ప్రవీణ్ కుమార్, భజరంగ్‌దళ్ అధ్యక్షుడు పానుకంటి భూమేశ్, ముధుల్కర్ శంకర్, నాగేశ్వరరావు, కట్ట నాగచారి, ముప్పిడి రవీందర్, పూర్వ విద్యార్థులు, హెచ్‌ఎం నరేశ్ పాల్గొన్నారు.

ప్రారంభమైన సప్తాహం

భైంసారూరల్: మండలంలోని కామోల్ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం సప్తాహం ప్రారంభమైంది. ఉగాది నుంచి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇప్పటికే పలువురు గ్రామస్తులు శ్రీరామ దీక్షలు స్వీకరించారు. ఆదివారం ఉగాది సందర్భంగా రామాయణ పారాయణం, పంచాంగ శ్రవణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.